క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


రేష్మా

బనగానపల్లె రూరల్: జాతీయ ఉపాధి హామీ పథకం మండల ఏపీఎంగా ఎస్ రేష్మా బుధవారం విధుల్లో చేరారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన హరికృష్ణ కొత్తపల్లి మండలానికి బదిలీ అయ్యారు. కొత్తపల్లి మండలంలో పనిచేస్తున్న రేష్మా బనగానపల్లె మండలానికి వచ్చారు.

బనగానపల్లె పంచాయతీ కార్యదర్శి


సతీష్‌రెడ్డి

బనగానపల్లె మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా సతీష్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న హరిప్రసాద్ అవుకు మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. దీంతో వైఎస్సార్ జిల్లా పెద్దముడియం మండలం పెద్దపసుపల పంచాయతీ కార్యదర్శిగా ఉన్న సతీష్‌రెడ్డిని ఉన్నతాధికారులు బనగానపల్లెకి బదిలీ చేయడంతో బాధ్యతలు తీసుకున్నారు.

రైతులకు శనగ విత్తనాలు పంపిణీ


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

బేతంచెర్ల: మండల పరిధిలోని అంబాపురం రైతు సేవా కేంద్రంలో రైతులకు బుధవారం సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీ చేశారు. సర్పంచ్ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి స్వామినాయక్ చేతుల మీదుగా అందజేశారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి


వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్ఓ


బేతంచెర్ల: ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్ఓ వెంకటరమణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ వెంకటరమణ తనిఖీ చేశారు. రికార్డులు, గర్భిణులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యులు అబ్దుల్ అలీమ్, ఎంపీహెచ్ఓ అబ్దుల్ గఫార్, స్టాఫ్ నర్స్ అనురాధ, ల్యాబ్ టెక్నిషియన్ సర్వేష్, ఫార్మసిస్టు ఇగ్బాల్ ఉన్నారు.

కారుణ్య నియామకాలకు అవకాశం కల్పించండి


మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

డోన్ రూరల్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, ఇంజినీరింగ్, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు విధుల్లో ఉండగా మరణిస్తే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చేలా చూడాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య, డోన్ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు పుల్లయ్య, అబ్బాస్ కోరారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ సప్తశైల రాజేష్‌కు వినతి పత్రం అందించారు.

వైభవంగా అమ్మవారి బిందెసేవ


అమ్మవారి బిందెసేవలో భక్తులు

సంజామల: మూల నక్షత్రం సందర్భంగా మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారికి బిందెసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు అమ్మవారి కలశాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయంలో సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

విప్లవ వీరుడు చేగువేరా


నివాళులర్పిస్తున్న సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు

బేతంచెర్ల: ప్రపంచ విప్లవోద్యమంలో చెరగని ముద్రవేసిన వీరుడు చేగువేరా అని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ అన్నారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయం ఆవరణలో చేగువేరా వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, సహాయ కార్యదర్శులు తిరుమలేష్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

డేంజర్ జర్నీ

- డోన్‌లో రైలు ఎక్కాలంటే పట్టాలు దాటాల్సిందే
- ప్రాణం మీదకు తెస్తున్న ప్రయాణం
- 4,5 ప్లాట్ ఫాంలలో పూర్తి కాని పనులు
- అక్కడే ఆగుతున్న పలు రైళ్లు


వృద్ధురాలిని చేతులతో మోసుకెళ్తున్న కుటుంబ సభ్యులు


గూడ్సు రైలు దాటి వెళుతున్న ప్రయాణికులు

డోన్ టౌన్: ప్రయాణికుల భద్రత, వారి క్షేమమే ధ్యేయమని చెప్పే రైల్వే అధికారుల ప్రకటనలు కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నాయి. నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా డోన్ రైల్వే అధికారుల్లో మాత్రం చలనం రావడంలేదు. డోన్ రైల్వే జంక్షన్ నుంచి నిత్యం సుమారు 46 రైళ్లతో పాటు అనేక గూడ్సు రైళ్లు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. రైల్వే స్టేషన్‌లో గతంలో మూడు ప్లాట్ ఫాంలు ఉండగా కొత్తగా మరో రెండు ప్లాట్ ఫాంల ఏర్పాటుతో మొత్తం ఐదు ప్లాట్ ఫాంలు ఉన్నాయి. వీటిలో 4,5 నూతనంగా ఏర్పాటు చేసినవి. అయితే ఈ ప్లాట్ ఫాంలకు పూర్తి స్థాయిలో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించలేదు. ఇలా ఉన్నా రైల్వే అధికారులు కొన్ని రైళ్లను ఆ ప్లాట్‌ఫాంలకు కేటాయిస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డోన్ రైల్వేస్టేషన్ ప్రవేశ ముఖ ద్వారంలో టిక్కెట్ కౌంటర్‌లు ఉన్న కారణంగా టిక్కెట్ తీసుకుని 4,5 ప్లాట్ ఫాంలకు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. 1,2,3, ప్లాట్ ఫాంలకు చెందిన రైల్వే లైన్లతో పాటు స్టేషన్‌లో గూడ్సు రైళ్ల ఆగడానికి ఉన్న లూప్ లైన్లను దాటి 4,5 ప్లాట్‌ఫాంలకు వెళ్లాల్సి ఉంటుంది. ప్రతి నిత్యం డోన్ నుంచి గుంటూరుకు వెళ్లే (17227) రైలు ఉదయం 6.30 గంటలకు 4వ నంబర్ ప్లాట్‌ఫాంపై ఉంచడం కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదే టైంలో మిగతా ప్లాట్ ఫాంలు ఖాళీగా ఉన్నప్పటికీ ప్రయాణికుల అనువైన ప్లాట్‌ఫాంలకు రైలును తీసుకరావడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. 4,5 నంబర్ల ప్లాట్ ఫాంలకు వెళ్లాలంటే వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు, లగేజీతో చేరుకోవాలంటే నరకం చూస్తున్నారు. గతంలో ఈ విషయం రైల్వే డీఆర్ఎం దృష్టికి తీసుకెళ్లగా కొద్ది రోజులు ప్లాట్ ఫాంలను మార్చారు. మళ్లీ ఇప్పుడే పాత ధోరణితో వ్యవహిస్తున్నారని ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. ప్రయాణికులు రైలు పట్టాలు దాటి ప్రమాకరరీతిలో వెళుతున్నా రైల్వే అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. గతంలో ప్లాట్‌ఫాంలు మారడానికి వెళుతూ ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఇప్పటికైన రైల్వే అధికారులు ప్రజల ఇబ్బందులను గుర్తించి ప్రయాణికులకు అనువైన ప్లాట్‌ఫాంకు రైలును నిలపాలని కోరుతున్నారు.

డీఆర్ఎం దృష్టికి తీసుకెళ్లాలి

సమస్యను ప్రయాణికులు రైల్వే డీఆర్ఎం దృష్టికి తీసుకెళితే బాగుంటుంది. డోన్ రైల్వేస్టేషన్ అమృత్ భారత్ రైల్వే స్టేషన్ కింద ఎంపికైంది. త్వరలో పూర్తి సౌకర్యాలు కల్పిస్తాం, ఎస్కలేటర్, లిఫ్ట సౌకర్యాలు వస్తాయి. డోన్ నుంచి గుంటూరు రైలును ఒకటో ప్లాట్‌ఫాం మీదకు తీసుకురావాలని కొందరు ప్రయాణికులు కోరుతున్నారు. అయితే ఆ సమయంలో ఇతర రైళ్లు ఉండే అవకాశం ఉంది. -ప్రమోద్‌కుమార్
-డోన్ ఇన్‌చార్జ్ రైల్వేస్టేషన్ మాస్టర్

నేడు డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. డిపో పరిధిలోని ఆయా రూట్లలో తిరిగే బస్సు సర్వీసులపై సూచనలు, సలహాలు, ఫిర్యాదులు అందజేయాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. 9959225798 నంబర్‌కు కాల్ చేసి సమస్యలు తెలియజేయాలని సూచించారు.

ఉద్యాన పంటలు లాభదాయకం

బేతంచెర్ల: ఉద్యాన పంటలు సాగు చేయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు అన్నారు. బుధవారం మండల పరిధిలోని సీతారామాపురం, యంబాయి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులు సాగుచేసిన ఉల్లి, కంది, పత్తి, మొక్కజొన్న, సజ్జ పంటలను పరిశీలించారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సాధారణ పంటలతో పాటు ఉద్యాన పంటలు సాగుచేయడం వల్ల మంచి లాభాలు పొందొచ్చని సూచించారు. ఆయన వెంట ఏఓ కిరణ్ కుమార్, ఉద్యాన అధికారి రఘువరన్ ఉన్నారు.

వైభవంగా వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ట



వీరభద్రస్వామి విగ్రహం, హోమ పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: కోటపాడులో నూతనంగా నిర్మించిన వీరభద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట జరిగింది. మూడు రోజుల ప్రత్యేక పూజల అనంతరం బుధవారం వేదపండితులు ఎల్లాల సంపత్‌కుమార్ శర్మ, హనుమాన్‌శాస్త్రి, శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా వీరభద్రస్వామి, గణపతి, నవగ్రహాలతో పాటు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ట చేశారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పూజల్లో పాల్గొన్నారు. వారికి వేద పండితులు స్వాగతం పలికారు. అనంతరం హోమంతో పాటు స్వామిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుంకమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కళావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు మూల ఈశ్వరరెడ్డి, రామసుబ్బయ్య, వెంకటేశ్వరరెడ్డి, హుసేన్‌రెడ్డి, పేరం సత్యనారాయణరెడ్డి, శేషశయనాయరెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొలిమిగుండ్ల: స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో అవుట్ సోర్సింగ్ కింద బోధనేతర సిబ్బంది పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ అబ్దుల్‌కలాం బుధవారం తెలిపారు. పాఠశాలలో మూడు వంట సహాయకుల పోస్టులు, స్వీపర్, నైట్‌వాచ్‌మెన్, చౌకీదారు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ మహిళలు అర్హులన్నారు. వాచ్‌మెన్‌కు ఏడో తరగతి, వంట సహాయకులకు ఎలాంటి విద్యార్హత అవసరం లేదన్నారు. 18 ఏళ్ల నుంచి 42 వయసు కలిగి ఉండాలన్నారు. ఈనెల 15వ తేదీలోపు స్థానిక ఎమ్మార్సీలో దరఖాస్తులను అందజేయాలని పేర్కొన్నారు.

- డోన్ టౌన్: స్థానిక కేజీబీవీ పాఠశాలలో అసిస్టెంట్ కుక్, స్వీపర్, నైట్ వాచ్ ఉమెన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓలు ప్రభాకర్, రామనర్సప్ప తెలిపారు. కుక్, స్వీపర్‌కు ఎలాంటి విద్యార్హత అవసరం లేదన్నారు. నైట్ వాచ్ ఉమెన్‌కు 7వ తరగతి ఉండాలన్నారు.
- బనగానపల్లె: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల మైనార్టీ పాఠశాలలో డే, నైట్ వాచ్‌మెన్, హెడ్‌కుక్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ స్వరూప తెలిపారు. వివరాలకు ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.
- బేతంచెర్ల: పట్టణంలోని కేజీబీవీలో హెడ్ కుక్-1, అసిస్టెంట్ కుక్-2, నైట్ వాచ్‌మెన్-1 పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. అలాగే మోడల్ స్కూల్‌లో హెడ్ కుక్ పోస్టుకు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

8 అంగన్‌వాడీ సహాయకులకు..

డోన్ రూరల్: డోన్ ఐసీడీఎస్ పరిధిలో 8 అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్‌బేగం కోరారు. ఇందులో డోన్ మున్సిపాలిటీ సెంటర్ నంబర్ 10 (ఓసీ), సెంటర్ -25(ఎస్సీ), చిన్నమల్కాపురం-2 (బీసీ-సీ), బి.రామాదుర్గం-2 (ఓసీ), బేతంచెర్ల మండలం బలపాలపల్లి(ఈడబ్ల్యూఎస్), గోరుమానుకొండ తండా (ఎస్టీ), బేతంచెర్ల సెంటర్ 12 (వీహెచ్), ప్యాపిలి మండలం నల్లమేకలపల్లి (ఓసీ) ఖాళీలు ఉన్నాయని వెల్లడించారు. ఈ నెల 21వ తేదీలోగా డోన్ ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.


బనగానపల్లె: సరస్వతిదేవిగా వాసవీమాత


కాళరాత్రి అలంకారంలో చౌడేశ్వరిదేవి


కోవెలకుంట్ల: సరస్వతిదేవిగా వాసవీమాత


అవుకు అమ్మవారిశాలలో..


బేతంచెర్ల: అమ్మవారిశాలలో..


బేతంచెర్ల: పుష్పాలంకరణలో వాసవీమాత

సరస్వతీ.. నమస్తుభ్యం

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు డోన్, బనగానపల్లె నియోజకవర్గాల వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు చదువుల తల్లి సరస్వతీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. పలు ఆలయాల వద్ద పిల్లలతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. -సాక్షినెట్‌వర్క్


అవుకు: అమ్మవారి కలశాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు


ప్యాపిలిలో సరస్వతిదేవిగా


డోన్: సరస్వతిదేవిగా వాసవీమాత


డోన్: లక్ష్మీదేవిగా కనకదర్గమ్మ


మద్దిలేటిస్వామి ఆలయంలో సరస్వతిదేవిగా మహాలక్ష్మి


బేతంచెర్ల: సింహ వాహనంపై వేంకటేశ్వరస్వామి

సస్యరక్షణతో అధిక దిగుబడులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త వెంకట్

కోవెలకుంట్ల: ఆయా పంటల్లో రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని నంద్యాల వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు వెంకట్, రమణమ్మ సూచించారు. బుధవారం మండలంలోని భీమునిపాడు, కంపమల్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విచక్షణారహితంగా రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడకుండా వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి తగిన మోతాదులో వేసుకోవాలన్నారు. రబీలో సాగు చేసిన పంటలను రైతులు ఈ-పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం భూసార పరీక్షల ఆవశ్యకత, కౌలు కార్డుల చట్టం, ఎరువుల యాజమాన్యం, వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం, ప్రకృతి వ్యవసాయం, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నిరంజన్, పశు వైద్యాధికారి కృష్ణకుమార్ పాల్గొన్నారు.

మద్యం దరఖాస్తులకు గడువు పొడిగింపు


బనగానపల్లె ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తుదారులతో కోలాహలం

బనగానపల్లె రూరల్/కొలిమిగుండ్ల: మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 11వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు బనగానపల్లె ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి తెలిపారు. ఎస్ఐ కమలాకర్‌తో కలిసి బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎక్సైజ్ పరిధిలోని కొలిమిగుండ్ల, అవుకు, బనగానపల్లె మండలాలకు సంబంధించి 12 మద్యం దుకాణాలకు 112 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. కొలిమిగుండ్ల మండలంలో మూడు మద్యం దుకాణాలకు 14 దరఖాస్తులు వచ్చాయన్నారు. గడువు పెంచడంతో మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. శుక్రవారం సాయంత్రం 7గంటల వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

ఒక్కరోజే 63 దరఖాస్తులు

మద్యం షాపులకు దరఖాస్తు చేసుకునేందుకు బుధవారం అధిక సంఖ్యలో కార్యాలయానికి తరలివచ్చారు. ఒక్క రోజే పోటాపోటీగా 63 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే గడువు పెంచినట్లు తెలియడంతో కొందరు ఊపిరి పిల్చుకున్నారు.

- సంజామల: మద్యం షాపులు ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 11వ తేదీ సాయంత్రం 7 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవచ్చని కోవెలకుంట్ల సర్కిల్ ఎక్సైజ్ సీఐ తాకీబాషా తెలిపారు. సంజామలలో ఎస్ఐ సందీప్‌తో కలిసి ఆయన మాట్లాడారు. సంజామల మండలానికి 4 మద్యం దుకాణాలు కేటాయించినట్లు చెప్పారు. ఈ నెల 14వ తేదీ లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామని తెలిపారు.

శభాష్ సంజీవదత్త


భగవద్గీత శ్లోకాలను వివరిస్తున్న సంజీవదత్త

కోవెలకుంట్ల: పదకొండేళ్ల బాలుడు భగవద్గీత శ్లోకాలను అవపోషణ పట్టి అందరిని ఆశ్చర్యపరిచాడు. పట్టణంలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం ఏడో రోజుకు చేరుకున్నాయి. బెంగళూరుకు చెందిన సంజీవదత్త అనే బాలుడు భగవద్గీతలో 700 శ్లోకాలను కంఠస్తం చేశాడు. ఆ బాలుడితో బుధవారం రాత్రి శ్లోకాల పఠన కార్యక్రమం నిర్వహించారు. ఏ పేజీలోని శ్లోకం అడిగినా ఎలాంటి సంకోచం లేకుండా చెబుతూ శభాష్ అనిపించుకున్నాడు. చిన్న వయసులోనే ఆధ్యాత్మికత వైపు అడుగులు వేసిన బాలుడిని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం, సంఘం నాయకులు నాగరాజు, అభిలాష్ అభినందించారు.

వీఓఏగా తప్పుకోవాలని ఒత్తిడి

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వీఓఏ


వెలుగు కార్యాలయంలో అధికారులతో వాగ్వాదానికి దిగిన వీఓఏ పద్మజ

కోవెలకుంట్ల: రెండేళ్ల నుంచి వెలుగు పథకంలో వీఓఏగా పనిచేస్తున్న ఓ చిరుద్యోగిపై టీడీపీ నాయకులు, ఆ శాఖ సిబ్బంది కక్ష కట్టారు. కోవెలకుంట్ల మండలం సౌదరదిన్నె గ్రామంలో రెండేళ్ల నుంచి పద్మజ అనే మహిళ వీఓఏగా విధులు నిర్వర్తిస్తోంది. ఆమె భర్త జనార్ధన్‌రెడ్డి నాలుగేళ్ల క్రితం పక్షవాతం సోకి మంచానికే పరిమితమయ్యాడు. ఇద్దరు కుమార్తెలు. ఉద్యోగం ద్వారా వచ్చే వేతనంతో కుటుంబ పోషణ, పిల్లలను చదివించుకుంటూ కాలం వెల్లదీస్తోంది. కాగా బుధవారం నిర్వహించిన వీఓఏల సమీక్షకు ఇదే గ్రామానికి చెందిన మరో మహిళ హాజరు కావడంతో విషయం తెలుసుకున్న వీఓఏ పద్మజ తనను తొలగించేందుకు కుట్ర పన్నుతున్నారని భావించి కుటుంబ సమేతంగా వెలుగు కార్యాలయానికి చేరుకుంది. ఏ తప్పు లేకున్నా తనను ఎలా తొలగిస్తారని అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగంలో చేరానన్న సాకుతో టీడీపీ నాయకులు, వెలుగు సీసీ గోపాలకృష్ణ కక్షకట్టారని వాపోయింది. తనకు, తన కుటుంబానికి ఏదైనా హాని జరిగితే వెలుగు సీసీగోపాలకృష్ణ, ఎస్‌హెచ్‌జీ లక్ష్మీదేవి కారణమని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయమై వెలుగు సీసీ గోపాలకృష్ణను వివరణ కోరగా త్వరలో గ్రామంలో పొదుపు సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయం తీసుకుని తర్వాత ఏం చేయాలన్నది నిర్ణయిస్తామని పేర్కొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు క్యూఆర్‌టీ


కోవెలకుంట్లలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్యూఆర్‌టీ

కోవెలకుంట్ల: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు క్యూఆర్‌టీ (క్విక్ రియాక్షన్ టీం)ను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి క్యూఆర్‌టీ బృందం కోవెలకుంట్లలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా జిల్లాలోని పోలీస్‌సబ్ డివిజన్ల పరిధిలో క్యూఆర్‌టీని నియమించారని తెలిపారు. ఈ టీంలో 15 నుంచి 20 మంది ఆయా సబ్ డివిజన్ల పోలీస్‌స్టేషన్లలో పనిచేసే పోలీసులు ఉంటారన్నారు. గ్రామాల్లో ఏ చిన్న సంఘటన జరిగినా ఈ టీఎం రంగ ప్రవేశం చేసి శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అలాగే రాత్రి వేళల్లో వివిధ రహదారుల్లో ఈ టీం వాహనాల తనిఖీ చేస్తుందని పేర్కొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

ప్యాపిలి: జలదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రపల్లి, హుసేనాపురం గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ నాగార్జున బుధవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హుసేనాపురం, చంద్రపల్లి బస్టాండ్ వద్ద ఆరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన ఈ సీసీ కెమెరాల ద్వారా మరింత పటిష్ట నిఘా ఉంచడానికి సాధ్యం అవుతుందన్నారు.

డోన్ సీఐ తీరు సరికాదు

డోన్: జిల్లా పోలీసు అధికారుల ఆదేశాలను లెక్కచేయకుండా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని డోన్ సీఐ ఇంతియాజ్‌బాషా తనపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారని బార్ అసోసియేషన్ కార్యదర్శి క్రిష్ణప్రసాద్ అన్నారు. స్థానిక బార్ అసోసియేషన్ ఆవరణలో బుధవారం విలేకరుల సమావేశంలో పలు విషయాలను పంచుకున్నారు. ఓ తప్పుడు కేసులో తనను ఇబ్బందులకు గురిచేయగా తాను జిల్లా ప్రధాన న్యాయమూర్తికి సమస్యను విన్నవించానన్నారు. ఆయన సూచన మేరకు ఎస్పీ విచారణకు ఆదేశిస్తే తనపై కక్షకట్టి ఇబ్బందుకు గురిచేస్తున్నారని తెలిపారు. కాగా సీఐ, న్యాయవాది మధ్య వ్యవహారం వారి వ్యక్తిగతమని, డోన్ బార్ అసోసియేషన్‌కు ఎలాంటి సంబంధం లేదని అధ్యక్షుడు వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు.

మత రాజకీయాలు చేయడం సిగ్గుచేటు

డోన్ రూరల్: ప్రపంచ విప్లవకారుడు, కమ్యూనిస్టు పార్టీ ముద్దబిడ్డ చేగువేరా అభిమానినని చెప్పుకుంటూ పవన్ కళ్యాణ్ రాజకీయాల్లోకి వచ్చి మత రాజకీయాలు చేయడం సిగ్గు చేటు అని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, ఏఐఎస్ఎఫ్ మాజీ ఉపాధ్యక్షుడు రంగనాయుడు విమర్శించారు. పట్టణంలోని నక్కి రామన్న భవనంలో బుధవారం చేగువేరా వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘం నాయకులు రణత్‌యాదవ్, రాధాకృష్ణ, పి.సుంకయ్య, ప్రతాప్ పాల్గొన్నారు.

కార్తీక వన భోజనాలను విజయవంతం చేద్దాం

డోన్ టౌన్: కార్తీక వన భోజన మహోత్సవాలను ఆర్యవైశ్యులు విజయవంతం చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్, డోన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొట్రికె హరికిషన్, వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు కొట్రికె పద్మజ, ఆవోపా సంఘం సభ్యులు పిలుపునిచ్చారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం వన భోజనాలకు సంబంధించిన కరపత్రాలను వాసవీమాత వద్ద ఉంచి పూజలు చేశారు. అనంతరం వాటిని ఆవిష్కరించారు. నవంబర్ 10వ తేదీ డోన్ ఉడుములపాడులోని చింతలక్రిష్ణ గార్డెన్స్‌లో వన భోజనాల కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటల పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. స్థానిక పాత బస్టాండ్ నుంచి చింతలక్రిష్ణ గార్డెన్స్‌కు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.